రేపు 'సాధికార' బస్సుయాత్ర

- ఏర్పాట్లను సమీక్షించిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- ఉత్సాహంగా జనం తరలిరావాలని పిలుపు


పార్టీ నాయకులతో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో మార్పు మొదలైంది. బడుగు, బలహీన వర్గాలను టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తే, సీఎం వైఎస్ జగన్ వారి వెన్నంటి నిలిచి గడిచిన నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూవచ్చారు. అంబేడ్కర్, పూలే తదితర మహనీయులు కన్న కలలను సాకారం చేస్తూ రాజ్యాధికారంలో అగ్రస్థానం కల్పించారు. కేబినెట్‌లో ఉండే 25 మంది మంత్రివర్గంలో 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే అవకాశం దక్కింది. నామినేటెడ్ మొదలు, స్థానిక సంస్థల వరకు అన్నింటా వారికే అగ్రపీఠం వేశారు. ఈ తరుణంలో సామాజికంగా అణగారిన వర్గాలకు అందించిన గౌరవ మర్యాదలు, వారి అభివృద్ధి, సంక్షేమానికి దక్కిన తోడ్పాటును వివరించేందుకే రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లోనూ 'సామాజిక సాధికార బస్సుయాత్ర'కు శ్రీకారం చుట్టారు.

రాయదుర్గంలో 5న బస్సుయాత్ర

ఈ నెల 5న రాయదుర్గంలో సామాజిక సాధికార బస్సుయాత్ర జరగనుంది. శాంతినగర్ లోని దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడి నుంచి బడుగు, బలహీన వర్గాల జన సందోహం మొదలు కానుంది. వేలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఈ యాత్రకు బ్రహ్మరథం పట్టేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. తేరు బజారు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పేద వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనాయకులు ప్రసంగించనున్నారు.

ఏర్పాట్లను సమీక్షించిన విప్ కాపు

రాయదుర్గంలో సాగే బస్సుయాత్ర రూట్‌మ్యాప్‌ను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదివారం పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ ఏర్పాట్లన్నీ విప్ తనయుడు కాపు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టారు. సభా ప్రాంగణం వద్ద వసతులు, విద్యుత్ లైట్లు, లౌడ్ స్పీకర్లు తదితర ఏర్పాట్లపై దగ్గరుండి సమీక్షించారు. బస్సుయాత్ర సందర్భంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు రహదారులన్నీ వైఎస్సార్‌సీపీ జెండాలు, తోరణాలతో నింపేయనున్నారు. నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా దారుల వెంబడి ఫ్లెక్సీలు కడుతున్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి స్వగృహంలో విప్ కాపు రామచంద్రారెడ్డి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి జన సమీకరణపై చర్చించారు. కాగా సామాజిక సాధికార యాత్రతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు పెద్దఎత్తున తరలివచ్చేలా ఊరూరా పిలుపు మొదలైంది. పేదలు స్వచ్ఛందంగా తరలివచ్చేలా పార్టీ కార్యాచరణ చేపట్టింది. ఈ దిశగా పట్టణంతో పాటు అన్ని మండలాల్లోనూ పార్టీ నాయకులు సమావేశాలు నిర్వహించి యాత్ర విజయవంతంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.


బహిరంగ సభ స్థలం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాపు ప్రవీణ్, నాయకులు

యాత్రను జయప్రదం చేద్దాం

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ పెద్దపీట వేశారు. ఈ కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్‌సీపీ వెంట చేకూర్చింది. గత టీడీపీ హయాంలో చంద్రబాబు ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తే, పాలనలోనే సగానికి పైగా పదవులిచ్చి సీఎం వైఎస్ జగన్ అగ్రస్థానం కల్పించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో చేకూర్చిన లబ్ధి, సామాజిక న్యాయం ద్వారా దక్కిన గౌరవం పట్ల వివరించేందుకే పార్టీ ఈ బస్సు యాత్రకు పార్టీ శ్రీకారం చుట్టింది. ఊరూరా ఉత్సాహంగా మహిళలు, యువత, రైతులు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతుగా నిలవాలి.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

ఘనంగా భ్రమరాంబ ఆలయ వార్షికోత్సవం

విడపనకల్లు: మండలంలోని ఉండబండ గ్రామంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు ప్రకాష్‌గౌడుతో కలసి ఆయన భ్రమరాంబ, మల్లికార్జున స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దానపురం జగద్గురువులు వీరసోమేశ్వర రాజశేఖరేంద్ర శివాచార్య భగవత్పాదులు వద్ద మాజీ ఎమ్మెల్యే తదితరులు ఆశీస్సులు పొందారు. రాజశేఖరేంద్ర శివాచార్య భగవత్పాదుల స్వాములను అడ్డ పల్లకీలో ఊరేగించారు. వీరభద్ర శివాచార్య స్వాములు, కల్యాణ స్వాములు, చన్న వీరశివాచార్య స్వాములు, అభినవ శివలింగేశ్వర రుద్రముని శివాచార్య స్వాములు, శరణుబసవనగిరిమాతాజీ స్వాములతో కలిసి కళ్యాణోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో హోమాలు, పూజలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నపూర్ణ, కరణం భీంరెడ్డి, హంపయ్య, ప్రకాష్‌గౌడు, రాజన్నగౌడు, గిరిబాబు, పెద్ద తిప్పయ్య, గోవిందు, ఓబుళన్న, శ్రీధర్,భాస్కర్,వడ్డే అంజినేయులు, షన్ముఖగౌడు,శంకర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.


మల్లికార్జున స్వామి ఆలయంలో ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


అడ్డ పల్లకీలో ఊరేగుతున్న వీరసోమేశ్వర రాజశేఖరేంద్ర శివాచార్య భగవత్పాదుల స్వామి

ఆక్రమణదారులపై కలెక్టర్ కొరడా

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: పట్టణంలోని బీటీపీ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలను కబ్జాచేసి, అమ్ముకునే వ్యాపారంపై కలెక్టర్ గౌతమి కొరడా ఝుళిపించారు. 'అమ్మకానికి డీ–పట్టాలు' అనే కథనం ఆదివారం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో అందుకు కలెక్టర్ స్పందించారు. తహసీల్దార్‌ సంతకాలతో డీ–పట్టాలు తయారు చేసే ముఠాను గుర్తించి క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు కళ్యాణదుర్గం ఆర్డీవో రాణిసుస్మిత ఆదేశాల మేరకు రాయదుర్గం తహసీల్దార్ ఓబులేసు రంగంలోకి దిగారు. సిబ్బందితో కలసి ఆదివారం బీటీపీ లేఅవుట్‌ను సందర్శించి, అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. పట్టాలు ఇచ్చిన వ్యక్తులు ఎవరో తెలపాలని, లేనిపక్షంలో మీపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆక్రమణలపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో బీటీపీ లేఅవుట్‌లో ఆక్రమణదారుల గుండెల్లో వణుకు మొదలైంది. దీని వెనుక పాత్రధారులు, సూత్రధారులుగా చెప్పుకునే టీడీపీ నాయకుల్లోనూ కలవరపాటు కనిపిస్తోంది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటున్న తహసీల్దార్ ఓబులేసు

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


బొమ్మనహాళ్: మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న దివ్యాంగులు


కూడేరు: మానవహారం నిర్వహించిన దివ్యాంగులు, ఆర్డీటీ అధికారులు


కళ్యాణదుర్గం రూరల్: మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు తిమ్మారెడ్డి

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో ఆదివారం శ్రీ స్ఫూర్తి విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ పాఠశాల నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీటీ జేఈ ఈశ్వరప్ప, సీఈఓ బాబు, నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగులను అందరితో సమానంగా చూడాలన్నారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కూడేరు: మండల కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీటీ అధికారులు షణ్ముఖ, నారాయణ మాట్లాడారు. దివ్యాంగులంతా కలిసి కట్టుగా ఉంటూ ముందుకు సాగితే హక్కులను సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య నేతలు నాగలక్ష్మి, రామలింగ, వెంకటేష్, మంజునాథ్, రామాంజనేయులు, హనుమంతు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయం వద్ద ఆదివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీతో టీ సర్కిల్ వరకు వెళ్లారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సుబ్బరాయ, విశాలంగుల మండల ఉపాధ్యక్షులు నారాయణస్వామి, సువిత, సెక్రటరీ గంగాధర్, ఉపాధ్యాయుడు కంబాల తిమ్మారెడ్డి, దివ్యాంగులు పాల్గొన్నారు.

ముగిసిన 'ప్రత్యేక ఓటరు నమోదు'

రాయదుర్గం/టౌన్: రాయదుర్గం నియోజకవర్గంలోని 296 బూత్‌లలో రెండు రోజుల పాటు జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం ముగిసింది. పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ ఓబులేసు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సుజాత పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో మొత్తం 833 దరఖాస్తులు స్వీకరించామని ఈడీటీ తెలిపారు. త్వరలో తప్పులేని ఓటరు జాబితా తయారు పూర్తి చేస్తామన్నారు.

వజ్రకరూరు: ఓటరు నమోదుకు 82 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని అన్ని పోలింగ్‌స్టేషన్‌లలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ అరుణ, వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఓబులేశు, ఈడీటీ సుజాత

కణేకల్లు: మండలంలో ఆదివారం నిర్వహించిన ఓటు నమోదు స్పెషల్ క్యాంపెయిన్‌లో 103 దరఖాస్తులొచ్చినట్లు తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధాత్రీ హోమం, వన భోజనం


ధాత్రీ హోమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి


వన భోజనాలు చేస్తున్న దేవాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘం సభ్యులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జయంతి కుప్పన్న వారి తోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక దామోదర ధాత్రీ హోమం, వన భోజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వన భోజన ఉత్సవంలో భాగంగా విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన విప్ దంపతులను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయంతి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని లత్తవరం ఉమామహేశ్వర ఆశ్రమంలో ఆదివారం ఉరవకొండ దేవాంగుల ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజనాల కార్యక్రమం సందడి నెలకొంది. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సామూహిక వనభోజనాలు చేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం

ఉరవకొండ: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని పద్మావతి, భాస్కర్‌రావు సహకారంతో భక్తులకు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదాన సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

గోనబావి రోడ్డుకు మోక్షం

గుమ్మఘట్ట: గోనబావి గ్రామానికి రోడ్డు మార్గం లేక పోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇటీవల ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు రోడ్డును పునరుద్ధరించాలని కోరారు. స్పందించిన విప్ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.95 లక్షలు డీఎంఎఫ్ నిధులను మంజూరు చేయించి తారు రోడ్డు నిర్మించడంతో మార్గం సుగమమం అయింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా కాలవ శ్రీనివాసులు పలుమార్లు సమస్య విన్నవించినా పట్టించుకోలేదని గ్రామస్తులు మండిపడ్డారు. రహదారి రూపురేఖలు సంపూర్ణంగా మారిపోవడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విప్ కాపు రామచంద్రారెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



గతంలో అధ్వానంగా ఉన్న గోనబావి రహదారి



సుందరంగా తయారైన తారురోడ్డు

సీఎస్ఐ చర్చిలో పెద్దల క్రిస్మస్

కంబదూరు: మండల కేంద్రంలోని సీఎస్ఐ మిషన్ చర్చిలో ఆదివారం పెద్దల క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య ప్రసంగీకులుగా గుర్రాల నుంచి వచ్చిన దైవజనులు లూకాదానియేల్, హిందూపురం నుంచి వచ్చిన మనోహర్ క్రీస్తు జననం గురించి వివరించారు. అనంతరం సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించి చర్చిలోని వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్ జేమ్స్, తాలూకా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు వల్లాకిషోర్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు రవికుమార్, సంఘ పెద్దలు దినకర్, జానోన్సి, ప్రభుదాను, ఎస్.పాల్, విజయకుమార్, జకరయ్య, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి రగ్బీ కిట్ల వితరణ

కంబదూరు: రగ్బీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మసూద్‌కు రగ్బీ కిట్లను దాతలు వితరణ చేశారు. మండలంలోని జెల్లిపల్లికి చెందిన మహమ్మద్ రఫీ కుమారుడు ఇటీవల జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యాడు. రగ్బీ కిట్లు కొనడానికి కూడా ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆదివారం ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాంచన గంగ, డీఎస్ మూర్తి తదితరులు మసూద్‌కు రగ్బీ కిట్లను అందజేశారు.

క్లుప్తంగా

సజావుగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష


తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు సజావుగా సాగాయి. పలు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 1,130 విద్యార్థులకు గానూ 1,096 మంది హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఐదు సంవత్సరాలు సంవత్సరానికి రూ.12,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్ షిప్ అందిస్తుంది. కాగా పరీక్షలను డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని జల్లిపల్లి వద్ద ఉన్న టోల్‌గేట్ సమీపాన అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కొర్రకోడు కు చెందిన ఆంజనేయులు, వెంకటేష్ గాయపడ్డారు. స్థానికులు టోల్‌గేట్ అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు.

బళ్లారికి వెళ్లి పింఛన్ అందజేత


రహముతుల్లాకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

కణేకల్లు: బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కణేకల్లు వాసి రహముతుల్లా కు వలంటీర్ యాసీన్ పింఛన్‌ను అందజేశారు. పింఛనుదారుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయినట్లు తెలుసుకున్న వలంటీర్ ఆదివారం బళ్లారి వెళ్లి రూ.2,750 పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌ను పలువురు అభినందించారు.

దళితులపై దాడి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మానిరేవు గ్రామానికి చెందిన మాదిగ రమేష్ అతని తండ్రి పెద్దన్నపై అదేరాం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దాడి చేశాడు. గతంలో దళితుల దగ్గర ఆ వ్యక్తి రూ.13, 200 నగదు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తిరిగి చెల్లించాలని వారు ఇంటి దగ్గరికి వెళ్లి అడిగారు. నా ఇంటి దగ్గరికి వచ్చి, నన్నే డబ్బులు అడుగుతారా అంటూ రమేష్, అతని తండ్రిపై ఆ వ్యక్తి చెప్పుతో దాడి చేశాడు. దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ జేసీసీ నాయకులు చెలమప్ప, మల్లయ్య, మనోహర్, రమేష్, రామాంజనేయులు, కృష్ణ తదితరులు కోరారు.

కేజీబీవీ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీపీ

విడపనకల్లు: మండలంలోని మాళాపురంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను ఎంపీపీ కరణం పుష్పావతి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య, వసతి, సమస్యలు, భోజనం నాణ్యతపై విద్యార్థినులను అడిగారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఓ సక్రమంగా విధులకు రావడం లేదని తమ దృష్టికి వచ్చిందని, ఇష్టానుసారంగా విధులకు వస్తే సహించేది లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అనంతరం ఎంపీపీ పరిసరాలు, భోజనం నాణ్యతను ఎంపీపీ పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భీంరెడ్డి, హంపయ్య,హేమంత్, కురుబ గిరిబాబు, సత్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'సంకల్ప యాత్ర'

ఉరవకొండ: మండలంలోని కౌకుంట్ల, రాకెట్ల గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ అమృతరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలతో గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాకెట్ల సర్పంచ్ శివమ్మ, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ మత్తులూరి అశోక్, అధికారులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



ఉరవకొండ: మండలంలోని రాకెట్ల గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు, పెన్నహోబిలం ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మత్తులూరి అశోక్, అనిత దంపతుల ఇంట ఆదివారం బ్రహ్మ కమలాలు విరిశాయి. చుట్టుపక్కలవారు పూజలు నిర్వహించారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

విడపనకల్లు: మండలంలోని ఉండబండలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కరణం పుష్పావతి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి సర్పంచుతో పాటు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, అధికారులు హాజరు కావాలన్నారు.

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామంలో సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ శారద, వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమంతరెడ్డి, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సిబ్బందిని నియమించాలని వినతి

కుందుర్పి: కళ్యాణదుర్గం రేంజ్ పరిధిలో అతి పెద్ద అటవీప్రాంతమైన జంబుగుంపల అటవీ ప్రాంత సంరక్షణకు సిబ్బందిని నియమించాలని రైతు సంఘం నాయకులు ఆదివారం రేంజ్ అధికారి రామ్‌సింగ్‌కి వినతి పత్రం అందజేశారు. 7 వేల ఎకరాలపైగా ఉన్న అటవీ ప్రాంతానికి ఒక బీట్ అధికారి మాత్రమే పనిచేస్తున్నారని, ఆయన కార్యాలయ పనులలో పరిమితం అవుతున్నారన్నారు. మరో ఇద్దరు సిబ్బందిని కేటాయించి అడవుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. రైతుల సంఘం నాయకులు గోపాల్, ఓబులేసు, హనుమంతప్ప, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సేవలు మరింత చేరువ చేస్తాం


పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

బొమ్మనహాళ్: పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువగా తీసుకువెళ్లడమే లక్ష్యమని గుంతకల్ డీఎస్పీ నరసింగప్ప అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. లాకప్ గదులు, నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, యాక్సిడెంట్ జోన్లపై ఆరా తీశారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణే లక్ష్యంగా పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువగా చేస్తామన్నారు. త్వరలోనే బొమ్మనహాళ్ స్టేషన్‌లో ఖాళీగా ఉన్న స్థానాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణయ్య, ఏఎస్ఐ రామదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి

బొమ్మనహాళ్: మండలంలోని సిద్దరాంపురంలో కనకదాస జయంతి వేడుకలను కురుబలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే మల్లికార్జున, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంత్రదాయల చంద్రప్ప, బసవరాజు, గంగాధర, లింగప్ప, నాగేష్, గాదిలింగ ఆధ్వర్యంలో కనకదాసు చిత్రపటానికి పూజలు చేపట్టారు. అనంతరం మహిళలు 101 కలశాలతో సాగగా కనకదాస చిత్రపటాన్ని ఊరేగించారు.

ఆర్డీటీ మాజీ హెల్త్ డైరెక్టర్ మృతి


సుధీర్‌రావ్ (ఫైల్)

శెట్టూరు: మండలంలోని చింతర్లపల్లికి చెందిన సుధీర్ రావ్(64) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన ఆర్డీటీలో హెల్త్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయన మృతిపై ప్రజా సంఘాల నాయకులు, కళ్యాణదుర్గం బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు..

కంబదూరు: మండలంలోని గూళ్యం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి(42)అనే వైఎస్సార్‌సీపీ నాయకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎర్రిస్వామి మృతదేహానికి రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, రాంపురం సర్పంచ్ చెన్నయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.